క్లుప్తంగా

దాడులను అడ్డుకుంటాం

దళిత, క్రైస్తవ, ముస్లిం సంఘాలు



మంగళగిరి: క్రైస్తవులు, ముస్లింలు, దళితులపై తోన్మాద శక్తులు హిందూమతం ముసుగులో దాడులకు పాల్పడుతున్నారని, చర్చిలను ధ్వంసం చేస్తూ భారత రాజ్యాంగంలో ఉన్న మత స్వేచ్ఛను హరించివేయడం బాధాకరమని పలువురు దళిత, క్రైస్తవ, ముస్లింలు పేర్కొన్నారు. క్రైస్తవులు, ముస్లింలు, దళితులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బుధవారం నగరంలోని ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భారతదేశం లౌకిక దేశం అనే విషయాన్ని మర్చిపోయి మతం మత్తులో మతోన్మాదులు దేశ కీర్తి ప్రతిష్టలను దిగజార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంగళగిరి పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బి.రవిప్రకాష్, తాడేపల్లి మండల అధ్యక్షుడు పాస్టర్ డగ్లస్, దుగ్గిరాల పాస్టర్స్ అధ్యక్షుడు ఉన్నం సురేష్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి.సహదేవ్, పాస్టర్లు మిల్కీ సెదక్, ఉప్పు స్టీఫెన్, మెస్సెక్, జమాతే ఇస్లామిక్ హింద్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి



ఫిరంగిపురం: వలంటీర్ల సేవలు ఎనలేనివని పంచాయతీ సర్పంచి మున్నంగి శివకుమారి అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా 19 వలంటీర్లకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో సర్టిఫికెట్ల ప్రదానం

తెనాలి: స్థానిక చెంచుపేటలోని యేల్చూరి అమ్మ వృద్ధాశ్రమంలో జాతీయ మాతృభాష దినోత్సవం గుంటూరులోని జనశిక్షణ్ సంస్థాన్ బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ పూర్తిచేసిన మహిళలకు సర్టిఫికెట్లను బుధవారం పంపిణీ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ అందజేశారు. నిర్వాహకులు వైఎస్ లక్ష్మి, సాయి, శేషుకుమార్, సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: పేదల ముంగిటకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తోందని, వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. నగరంలోని శ్రీలక్ష్మి నృసింహస్వామి దేవస్థానం వద్ద ఉన్న రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు కళావేదికలో బుధవారం ఏర్పాటు చేసిన సురక్ష మెడికల్ క్యాంప్‌ను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవితో కలసి పరిశీలించారు. అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రతి గడపకు వైద్యులు వెళ్లి వైద్యం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ప్రజలు ముఖ్యంగా వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలన్నారు. తొలుత రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు, శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి...

నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఎట్టి పరిస్థితుల్లో ఆగకూడదని, ఎటువంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అధికారులకు సూచించారు. బుధవారం ఆయన నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవితో కలసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ పరిధిలో తుది దశకు చేరుకున్న పలు అభివృద్ధి పనులను గురించి ఇంజినీరింగ్ విభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్‌కుమార్, డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. నగరంలోని రాజీవ్ గృహకల్ప వద్ద తుది దశకు చేరుకున్న రజక, పద్మశాలీయ కళ్యాణ మండపాల నిర్మాణ పనులను పరిశీలించారు. సుమారు రూ. 2 కోట్లతో రజక, పద్మశాలీయ కళ్యాణ మండపాల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

మేడికొండూరు: సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మండల పరిధిలోని డోగిపర్రు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం నిర్వహించారు. గ్రామంలో ఎంపీయూపీ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం జోసిల్ కెంపెనీ సహకారంతో రూ.26 లక్షలతో నిర్మాణానికి జోసిల్ కంపెనీ ఎండీ జాగర్లమూడి మురళీమోహన్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే సుచరిత మాట్లాడుతూ గ్రామంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. ప్రజలకు అభివృద్ధి అంటే తెలుస్తోందన్నారు. గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు, మండల పరిషత్ నిధులతో గ్రామప్రజల నీటి సమస్య పరిష్కారానికి బోర్లకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో శ్మశాన వాటికలను పరిశీలించి, వాటి అభివృద్ధికి తగు సూచనలు చేశారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి ప్రజలందరికి వలంటీర్లు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజల మన్ననలు పొందాలని కోరారు. జోసిల్ ఎండీ జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం సహాయం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, గ్రామ సర్పంచి కొండెపోగు సామ్రాజ్యం,పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్, స్కూల్ కమిటి చైర్మన్ ఉడతా ప్రభాకర్, మండల కన్వీనర్ తాళ్లూరు వంశీకృష్ణ, సచివాలయాల కన్వీనర్ నాసర్‌వలి, అబ్బాస్, గండికోట రసూల్, దాసు, కొరివి చెన్నయ్య, కొరివి కిషోర్, జోసిల్ సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, జాగర్లమూడి మురళీమోహన్

నేడు అగ్నిప్రమాద బాధిత రైతుల ధర్నా

తాడేపల్లిరూరల్: గత నెల 19వ తేదీన దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ గురువారం ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ పసుపు రైతుసంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు తెలిపారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్‌లో పసుపు రైతుల సంఘం నాయకులతో కలసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. అగ్ని ప్రమాదానికి గురై పసుపు పంట పూర్తిగా దగ్ధం అయిన పరిస్థితుల్లో రైతు సంఘాల ఆందోళన చేపట్టిందని అన్నారు. అగ్ని ప్రమాదం దర్యాప్తును సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో జనవరి 30న కోల్డ్ స్టోరేజ్‌ను పరిశీలించి వారం రోజుల్లో విచారణ జరిపి వివరాలను రైతులకు అందజేస్తామని అన్నారని వివరించారు. ప్రమాదం జరిగి 33 రోజులు అయినా ప్రభుత్వం నుంచి రైతాంగానికి ఎటువంటి సమాచారం అందలేదని, రైతులు ఆందోళనలో ఉన్నారని, తక్షణమే పసుపు దగ్ధమైన రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం క్వింటా పసుపు ధర రూ.11,800 ఉందని, ఆ ధర ప్రకారం పసుపు యార్డులో నిల్వ ఉంచిన ప్రతి రైతుకి క్వింటాకు రూ.11,800 చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విన్నవించారు. గురువారం ఉదయం 10 గంటలకు దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని అన్నారు. సమావేశంలో కోల్డ్ స్టోరేజ్ బాధితుల కన్వీనర్ కాజా వెంకటేశ్వరరావు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, భీమవరపు కోటిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ పసుపు రైతుసంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు

పాడి పరిశ్రమ అభివృద్ధికి పసిదూడల పెంపకం దోహదం

ఏపీ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ సీఈఓ శ్రీనివాసరావు

పెదపరిమి(తాడికొండ): పాడి పరిశ్రమ అభివృద్ధికి సమర్థవంతమైన పసిదూడల పెంపకం ఎంతో మేలు అని ఏపీ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ సీఈఓ శ్రీనివాసరావు సూచించారు. తుళ్లూరు మండలం పెదపరిమిలో ఏడాది లోపు పసిదూడల ప్రదర్శనను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మంచి ఆరోగ్యవంతమైన పసిదూడలను పెంచడం వలన రైతులకు పాల ఉత్పత్తికి సంబంధించిన లాభాలతో పాటుగా నాణ్యమైన పశుగణాభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. రైతులందరూ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో అధిక పాల ఉత్పత్తులను సాధించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పెదపరిమి వెటర్నరీ డాక్టర్ శ్రీ పతి రేణుకాదేవి, డాక్టర్ ఎ.మురళీ కృష్ణ, డాక్టర్ టి.శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్ సుమబాల, డాక్టర్ ఎం.మౌనిక, వైఎస్సార్‌సీపీ నాయకులు నంబూరు రఘునాథరావు, పుట్టి సుబ్బారావు, శ్రీనివాస రెడ్డి, మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో పాల్గొన్న ఉత్తమ జాతి దూడల రైతులకు బహుమతులు అందజేశారు.



ప్రదర్శన ప్రారంభిస్తున్న ఏపీ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు

ప్రభుత్వ పాఠశాలకు రంగులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బుధవారం ప్రాతూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రంగులు వేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.హనుమంతరావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలకు, బ్లాక్ బోర్డులకు, నేమ్ బోర్డులకు వలంటీర్లు రంగులు వేయడం అభినందనీయమని అన్నారు. ఈసీఎం విభాగాధిపతి డాక్టర్ సుమన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి భవిష్యత్ పాఠశాల విద్యపైనే ఆధారపడి ఉంటుందని, విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దేది గురువు లేనని, అటువంటి పాఠశాలలను, గురువులను మరవకూడదని అన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు రంగులు వెలిసిపోయి ఉండడం గమనించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం బృందం రంగులు వేయాలని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. సేవా కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను, సమన్వయకర్తలు పి.సురేష్, జి.చంద్రశేఖర్‌లను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్ అభినందించారు.



ప్రాతూరులోని ప్రభుత్వ పాఠశాలకు రంగులు వేస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలంతా అండగా నిలవాలి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి

మంగళగిరి: పేద, బడుగు, బలహీన వర్గాలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి అన్నారు. నగరంలోని 17వ వార్డులో గుడ్ మార్నింగ్ మంగళగిరి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పార్టీలోకి తిరిగి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, నాయకులు ఎండీ ఫిరోజ్, డోకిపర్తి శ్రీనివాస్, మునగాల చంద్రశేఖర్, బేతపూడి సాంబయ్య, మల్లవరపు సుధారాణి, బేతపూడి నర్సయ్య, రాచకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ముగిసిన కోనేరు లక్ష్మయ్య స్మారక క్రీడా పోటీలు





టెన్నిస్‌లో ప్రథమ స్థానం సాధించిన జ్యోత్స్నకు, కబడ్డీలో ప్రథమ స్థానం సాధించిన కేఎల్‌యూ విద్యార్థులకు మెమెంటో అందజేస్తున్న వీసీ పార్థసారథివర్మ

విజేతలకు బహుమతులు పంపిణీ

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కోనేరు లక్ష్మయ్య స్మారక క్రీడలు 2024 బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని తెలిపారు. మానసిక ఉల్లాసం, శారీరక ఆరోగ్యంతో పాటు క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని చెప్పారు. మొత్తం ఐదు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. కబడ్డీ లో కేఎల్‌యూ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా, ఎన్టీఆర్ జిల్లా పరిటాల అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని సాధించారని చెప్పారు. ఖోఖోలో కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని, ఎన్టీఆర్ జిల్లా పరిటాల మిక్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారని తెలిపారు. బాస్కెట్ బాల్‌లో హైదరాబాద్ వీఎన్ఆర్ బీజేపీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా, వడ్డేశ్వరం కేఎల్‌యూ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారని చెప్పారు. హైదరాబాద్ నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు త్రోబాల్ మహిళల విభాగంలో ప్రథమ స్థానాన్ని , కేఎల్‌యూ విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకొన్నారని తెలిపారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్స్‌లర్లు ఎ.వి.ఎస్. ప్రసాద్, ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సీహెచ్. హనుమంతరావు, డీన్ సలహాదారులు హబీబుల్లా ఖాన్, క్రీడల అసోసియేట్ డీన్ కె. హరికిశోర్, ఆర్. శుభాకర్ రాజు, వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా పద్మజ బాధ్యతల స్వీకారం

ఫిరంగిపురం: తహసీల్దార్‌గా ఎం .పద్మజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. డీటీ రాజారమేష్ తహసీల్దార్‌కు అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని గొడవర్రు గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యులు నడకుదిటి సుబ్రహ్మణ్యం సంస్మరణ సభకు మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ళ రామకృష్ణారెడ్డి(ఆర్కే) మంగళవారం హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేసి 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి పాల్గొన్నారు.

ఉత్సాహంగా నాటిక పోటీలు

తెనాలిటౌన్: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి తృతీయ ఆహ్వాన నాటిక పోటీలు బుధవారం మూడో రోజు కొనసాగాయి. స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న పోటీలలో తొలుత కర్ణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ వారి 'నాలోన నీవే' సాంఘిక నాటికను ప్రదర్శించారు. అనంతరం పట్టణంలో సేవా రంగ ప్రముఖులు విజయలక్ష్మి శ్రీనివాసా నాట్యమండలి నిర్వాహకులు దీపాల సుబ్రమణ్యం, యేల్చూరి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు నాగలక్ష్మిలను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభోత్సవం

- ముఖ్య అతిథిగా పాల్గొననున్న రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి
- వివరాలు వెల్లడించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ రూరల్ వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, పార్టీ రూరల్ అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ, కుంచనపల్లి మాజీ వైస్ సర్పంచి అమరా నాగయ్య, జేసీఎస్ గుంటూరు జిల్లా కో ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్ రాజు వివరాలు వెల్లడించారు. గురువారం సాయంత్రం 5 గంటలకు క్రిస్టియన్‌పేటలోని చర్చి ఎదురుగా నవోదయా కాలనీకి వెళ్లే దారిలో వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, ఇతర ముఖ్య నాయకులు హాజరవుతారని, ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు మాచర్ల అబ్బు, ఎండి గోరేబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మేకా అంజిరెడ్డి, కళ్యాణ్, సుబ్బు, గోగుల శ్రీను పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు